E69 NEWS
తెలుగు గళం
సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం :
9959812941-9949356387

PUBLISHED: TELANGANA సంపుటి :01 సంచిక :152 సోమవారం 11 మే 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 08 వెల :05/-

## తెలంగాణపై తొలి నుంచి సవతి తల్లి ప్రేమ : యెన్నం శ్రీనివాస్ రెడ్డి



ఈ 12 యేళ్లలో కేంద్రం నుంచి తెలంగాణకు తీసుకువచ్చిన నిధులు ఎంతో బీజేపీ మంత్రులు, ఎంపీలు చెప్పాలని, తెలంగాణ పై మొదటి నుంచి సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని ప్రభుత్వ విప్, యెన్నం శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. ఆదివారం సీఎల్పీ మీడియా సెంటర్ లో మీడియాతో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు కాగానే ఏడు మండలాలను ఆంధ్రాకు ఇచ్చారని, పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా ఇస్తామని ఎన్నికల సమయంలో చెప్పారు..కానీ, ఆ తర్వాత ఆ ఊసే లేదని ఆయన మండిపడ్డారు. పోలవరానికి జాతీయ హోదా ఇచ్చారు..శరవేగంగా అక్కడ పనులు జరుగుతున్నాయి..తమ పాలమూరు బిడ్డలు భారతదేశంలో లేరా? ఎందుకింత నిర్లక్ష్యమని యెన్నం శ్రీనివాస్ రెడ్డి నిలదీశారు. అమరావతి నిర్మాణం కోసం వేల కోట్లు ఇస్తున్న కేంద్రం భారత్ ఫ్యూచర్ సీటీ కి రూపాయి ఇవ్వడం లేదని, ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి బీజేపీ నాయకులు అడ్డు పడుతున్నారని ఆయన ఆరోపించారు.

2 లో


## ఈనెల 12న బీఆర్ఎస్ ముఖ్య నేతలతో కేసీఆర్ భేటీ




ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో ఈనెల 12న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ సీనియర్లతో సమావేశం కానున్నారు. ఈ భేటీలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ ప్రధాన కార్యదర్శులు, మండలి, శాసనసభాపక్షాల ఉప నాయకులు పాల్గొనున్నారు. మధ్యాహ్నం భోజన విరామం తర్వాత పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వం, పార్టీ ఇంచార్జీల నియామకంతో పాటు పార్టీ బలోపేతం వంటి ముఖ్య విషయాలపై చర్చ జరుగుతుందని బీఆర్ఎస్ పార్టీ వర్గాలు ఓ ప్రకటనలో వెల్లడించాయి.

## నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు

### అమిత్ షా సహా కేంద్ర మంత్రులతో కీలక భేటీలు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి హస్తిన పర్యటనకు సిద్ధమయ్యారు.. నేడు ఢిల్లీలో పర్యటించనున్నారు సీఎం చంద్రబాబు.. నేడు ఉదయం హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లనున్న సీఎం.. ఉదయం 11.30 గంటలకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో భేటీ కానున్నారు. అనంతరం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తోనూ ముఖ్యమంత్రి సమావేశం అవుతారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులు, నిధులకు సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రులతో సీఎం చర్చించమన్నారు. ఇక, మధ్యాహ్నం 3 గంటలకు ప్రపంచబ్యాంకు ప్రతినిధులు సీఎంతో సమావేశం కానున్నారు. సాయంత్రం 4 గంటలకు హోటల్ తాజ్ ప్యాలెస్ లో భారత పరిశ్రమల సమాఖ్య బిజినెస్ సమ్మిట్ కు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతారు. అనంతరం ప్రధాని ఆర్థిక సలహా మండలి చైర్మన్ ఎస్. మహేంద్రదేవ్ సహా నీతిఆయోగ్ సభ్యులతో సమావేశం అవుతారు ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఇక, రేపు రాత్రికి ఢిల్లీలోనే బస చేయనున్నారు ఆంధ్రప్రదేశ్ సీఎం.. తదుపరి రోజు కూడా కొన్ని కీలక సమావేశాల్లో పాల్గొనే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.




- తెలంగాణలో రూ. 9,400 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రధాని మోడీ శ్రీకారం.
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ సభలో విపక్షాలపై నిప్పులు
- అంతర్జాతీయ అస్థిరత దృష్ట్యా ఇంధన వినియోగంపై ప్రజలకు కీలక సూచనలు.
- బెంగాల్ తర్వాత బీజేపీ తదుపరి లక్ష్యం తెలంగాణేనని స్పష్టమైన ప్రకటన.
- రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం పెద్దపీట వేస్తోందని వెల్లడి.

హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం తెలంగాణలో పర్యటించి రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేశారు. సుమారు రూ. 9,400 కోట్ల విలువైన వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు, సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు అటు రాజకీయ వర్గాల్లో, ఇటు ప్రజల్లో ఆసక్తిని రేకెత్తించాయి.

**తెలంగాణ అభివృద్ధికి మోడీ 'గ్యారెంటీ'**

తెలంగాణ పర్యటనలో భాగంగా ప్రధాని అనేక కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ముఖ్యంగా వరంగల్‌లో పీఎం మిత్ర పార్క్ (మెగా టెక్స్‌టైల్ పార్క్), జహీరాబాద్ పారిశ్రామిక ప్రాంతం, మరియు పలు రైల్వే, రహదారి ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "భారతదేశం నేడు రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్‌పై దూసుకుపోతోంది. తెలంగాణను మ్యాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చడమే మా లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు.

గత 12 ఏళ్లలో తెలంగాణలో జాతీయ రహదారుల నెట్‌వర్క్ రెట్టింపు అయ్యిందని, రైల్వేల ఆధునీకరణకు కేంద్రం కట్టుబడి ఉందని ప్రధాని వివరించారు. ఈ ప్రాజెక్టుల వల్ల వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మిగతా 2లో..

## రేవంత్ - మోదీ సరదా సంభాషణ




హైదరాబాద్ వేదికగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాల సాక్షిగా ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిల మధ్య ఆసక్తికరమైన చర్చ నడిచింది. అధికారిక కార్యక్రమం ముగిసిన అనంతరం సికింద్రాబాద్ బహిరంగ సభ వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానిని ఉద్దేశించి కీలక విన్నపం చేశారు. "తెలంగాణ అభివృద్ధికి రాజకీయాలు అడ్డుకాకూడదని, రాష్ట్రాన్ని ఒక పెద్దన్నలా కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని" ఆయన కోరారు. విభజన హామీలు, నిధుల విడుదల విషయంలో తెలంగాణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

మిగతా 2లో..

## అందర్నీ కదిలించిన బండి సంజయ్ ప్రసంగం



సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ వేదికగా జరిగిన బిజెపి బహిరంగ సభలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అత్యంత ఉద్వేగభరితంగా ప్రసంగించారు. రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినప్పటికీ, ప్రత్యర్థి పార్టీలు వ్యక్తిగత దూషణలకు దిగుతూ రాజకీయాల స్థాయిని దిగజారుస్తున్నాయని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రసంగిస్తున్న సమయంలో ఆయన గొంతు ఆవేదనగా మారటం, సభికులను కలిచివేసింది. విలువలతో కూడిన రాజకీయాలు చేయాలే తప్ప, అధికారం కోసం కక్షసాధింపులకు దిగడం సరైన పద్ధతి కాదని ఆయన హితవు పలికారు.

మిగతా 2లో..

# విజయ్ అనే నేను...




తమిళనాడు రాజకీయాల్లో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ అట్టహాసమైన కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలల నుండి వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తల జయజయధ్వానాలతో స్టేడియం హోరెత్తిపోయింది.



విజయ్‌తో పాటు మరో పది మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో పార్టీ ముఖ్య నేతలు ఎన్. ఆనంద్, ఆధవ్ అర్జున తదితరులు ఉన్నారు. ఈ కొత్త మంత్రివర్గంలో మహిళలకు, యువతకు ప్రాధాన్యత దక్కడం విశేషం. దశాబ్దాల పాటు సాగిన ద్రావిడ పార్టీల ఆధిపత్యానికి తెరదించుతూ, ఒక నటుడు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించడం తమిళ రాజకీయాల్లో ఎంజీఆర్, జయలలిత కాలం నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చింది.

**అతిథుల మధ్య ఆకర్షణగా నిలిచిన త్రిష**

ఈ వేడుకకు రాజకీయ ప్రముఖులతో పాటు చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు సెలబ్రిటీలు హాజరయ్యారు. అయితే, అందరి దృష్టి ముఖ్యంగా హీరోయిన్ త్రిష కృష్ణన్ మీద నిలిచింది. నీలిరంగు కాంచీవరం పట్టుచీరలో మెరిసిపోయిన త్రిష, ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విజయ్‌తో అనేక హిట్ సినిమాల్లో నటించిన త్రిష, తన తల్లి ఉమా కృష్ణన్‌తో కలిసి హాజరయ్యారు. వేదిక వద్ద విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్‌ను త్రిష ఆత్మీయంగా పలకరించి, ఆమెను హత్తుకున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

**ముఖ్యమంత్రిగా విజయ్ తొలి ప్రసంగం:**

ప్రమాణ స్వీకారం అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో విజయ్ ఉద్వేగభరితంగా ప్రసంగించారు. "నేను మీలో ఒకడిని.. ఒక సామాన్యుడిని. మీ నమ్మకమే నన్ను ఇక్కడికి చేర్చింది" అని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం 'నిజమైన లౌకిక సామాజిక న్యాయం' అనే నినాదంతో ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. మైనారిటీల రక్షణకు తన ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఆయన ప్రకటించారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ, గత ప్రభుత్వం సుమారు రూ. 10 లక్షల కోట్ల అప్పును మిగిల్చిందని విమర్శించారు. పారదర్శకత కోసం త్వరలోనే రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై 'శ్వేతపత్రం' విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. అవినీతికి తావులేని పాలన అందిస్తానని, తనతో పాటు తన మంత్రులు కూడా ఒక్క పైసా తప్పు చేయకుండా చూస్తానని గట్టిగా హెచ్చరించారు.

**తొలి రోజే కీలక నిర్ణయాలు**

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే విజయ్ మూడు కీలక ఫైళ్లపై సంతకాలు చేశారు. ప్రజలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళల భద్రత కోసం ప్రతి జిల్లాలో ప్రత్యేక ఫోర్స్ ఏర్పాటు, మరియు రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్ నివారణకు కఠిన చర్యలు తీసుకునే ఫైళ్లపై ఆయన మొదటి సంతకాలు చేయడం ద్వారా తన ప్రాధాన్యాలను చాటుకున్నారు.

తెలుగు గళం
సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

సోమవారం ,
మే 11 2026



# నేడు బెంగాల్... రేపు తెలంగాణ.. మోదీ టార్గెట్

మొదటి పేజీ తరువాయి



### అంతర్జాతీయ పరిస్థితులపై ప్రజలకు విజ్ఞప్తి

ప్రసంగంలో భాగంగా ప్రధాని మోడీ ప్రస్తుత అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న యుద్ధాలు, అస్థిరత వల్ల ఇంధన వనరుల కొరత ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ క్రమంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఇంధనాన్ని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. దేశ ఆర్థిక భద్రత దృష్ట్యా దిగుమతి చేసుకునే ఇంధన వనరులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

### బెంగాల్ తర్వాత తెలంగాణే!

రాజకీయంగా ఈ సభలో మోడీ అత్యంత కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల బీజేపీ సాధించిన ఫలితాలను ఉదాహరణగా చూపుతూ తెలంగాణ ప్రజల్లో ఉత్సాహం నింపారు. "పశ్చిమ బెంగాల్‌లో నిరంకుశ పాలనను ప్రజలు ఎలాగైతే ఓడించారో, తెలంగాణలోనూ అదే మార్పు రావాలి. బెంగాల్ తర్వాత ఇప్పుడు మా పూర్తి దృష్టి తెలంగాణపైనే ఉంది. త్వరలోనే ఇక్కడ కూడా బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుంది" అని ఆయన స్పష్టం చేశారు.

కుటుంబ పాలన, అవినీతిపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ ఆకాంక్షలు నెరవేరాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ అవసరమని, ఇక్కడి ప్రజలు మార్పు కోసం ఎదురుచూస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు.

### తెలంగాణ భవిష్యత్తుపై భరోసా

చివరగా, తెలంగాణ అభివృద్ధి చెందితేనే భారతదేశం అభివృద్ధి చెందుతుందని ప్రధాని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి కేంద్రం నుండి రావాల్సిన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈ సభకు భారీ ఎత్తున తరలివచ్చిన జనసందోహాన్ని చూస్తుంటే మార్పు స్పష్టంగా కనిపిస్తోందని మోడీ హర్షం వ్యక్తం చేశారు.

ఈ పర్యటనతో తెలంగాణలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ప్రధాని ఇచ్చిన పిలుపుతో బీజేపీ శ్రేణులు ఎన్నికల సమరానికి సమాయత్తమవుతున్నాయి.

# ఈ ఏడాది యథావిధిగా ఇంటర్ అడ్మిషన్లు: సీఎం రేవంత్ రెడ్డి



వచ్చే విద్యా సంవత్సరం కొన్ని సంస్కరణలు చేయాలన్న ప్రతిపాదనల నేపథ్యంలో ఇంటర్మీడియట్ ప్రవేశాలపై ఏర్పడిన గందరగోళానికి సీఎం రేవంత్ రెడ్డి ఫుల్ స్టాప్ పెట్టారు. ఈ ఏడాది యథావిధిగా ఇంటర్మీడియట్ ప్రవేశాలు చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రవేశాలకు సమయం తక్కువగా ఉండడం, ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రక్రియకు పలు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉండడంతో విద్యార్థుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా వెంటనే ప్రవేశాల ప్రక్రియను చేపట్టాలని సీఎం సూచించారు. ఇంటర్మీడియట్?ను రద్దు చేసి సీబీఎస్ఈలో మాదిరే 11, 12 తరగతులు నిర్వహించాలని.. ఫలితంగా డ్రాపౌవుట్స్ సంఖ్య గణనీయంగా తగ్గుతుందని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. సీబీఎస్ఈతో పాటు మెజారిటీ రాష్ట్రాలు 11, 12 తరగతుల విధానాన్ని అనుసరిస్తున్నాయి. మన రాష్ట్రంలో మాత్రం ఇంటర్మీడియట్ విద్య వేరుగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు చదివిన విద్యార్థుల్లో అత్యధికులు ఆ తర్వాత ఇంటర్మీడియట్‌కు వేరుగా ఉన్న కళాశాలల్లో చేరడం లేదు. అప్పటితో చదువును నిలిపివేస్తున్నారు.

విస్తృత సంప్రదింపులు:

ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్‌ను వేరుగా కాకుండా 11, 12 తరగతులుగా కొనసాగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో అధికారులకు సూచించారు. ఇదే అంశాన్ని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సైతం తన నివేదికలో పేర్కొంది. ఈ క్రమంలో ఇటీవల ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలను నిలిపివేస్తూ అధికారులు ప్రకటన విడుదల చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఎంపీ వే.నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, విద్యా శాఖ కమిషనర్ యోగితా రాణాలతో చర్చించారు. విలీనంతో ముడిపడిన పలు సాంకేతిక సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సి ఉన్నందున ఈ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించారు. విలీన ప్రక్రియకు సంబంధించి భాగస్వాములతో విస్తృతంగా సంప్రదరింపులు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై నియమించిన కమిటీ అధ్యయనం చేసి తన నివేదిక సమర్పించాలని సీఎం సూచించారు. అనంతరం శాసనసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# తెలంగాణపై తొలి నుంచి సవతి తల్లి ప్రేమ: యెన్నం శ్రీనివాస్ రెడ్డి



గుజరాత్ లో గిఫ్ట్ సిటీ పెట్టి పారిశ్రామిక రాయితీలు ఇస్తున్నారని, హైదరాబాద్ లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ కు కూడా రాయితీలు ఇస్తే బాగుండేది.. కానీ, తీరని అన్యాయం చేశారని విమర్శించారు. మెట్రో విస్తరణకు కేంద్రం సహకారం లేకపోవడంతో సొంత నిధులతో చేపట్టాల్సి వస్తోందని, మోదీ చూడగానే తెలంగాణ బీజేపీ నాయకులు నోరుమెదపడం లేదని ఆయన మండిపడ్డారు.

కేంద్రం ఇచ్చే గ్రాంట్లు, నిధులు అన్నింట్లో ఆంధ్రప్రదేశ్ తో పోల్చినప్పుడు తెలంగాణకు అన్యాయం జరుగుతోందని, ఏపీకి నిధుల వరద పారుతోందని యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దేశంలోనే అత్యధిక అవినీతి రాష్ట్రం తెలంగాణ అని మోదీ విమర్శించారని, కేసీఆర్ కుటుంబంపైన ఈగ కూడా వాలనివలేదు..ఒక్క కేసు పైన కూడా విచారణ జరపలేదని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం విచారణ కోరితే డెస్క్‌లో పెట్టి కేంద్రం తాళం వేసిందని, వంద రోజుల్లో కేసీఆర్ ను జైలులో వేస్తామన్న బీజేపీ, బీఆర్ఎస్ బలం ఫెవికాల్ కంటే ధృడమైనదని యెన్నం శ్రీనివాస్ రెడ్డి విమర్శలు గుప్పించారు. విద్యలో అనేక సంస్కరణలు తీసుకువస్తున్న రాష్ట్రానికి కేంద్రం ఎందుకు సహకరించడం లేదు? ఎఫ్ఆర్బీఎం పరిధి నుంచి ఎడ్యుకేషన్లకు సంబంధించిన రుణాలను మినహాయించాలని కోరితే కేంద్రం పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్ తోకపట్టుకుని కుర్చీలో కూర్చోవాలని బీజేపీ ప్రయత్నం చేస్తోందని, అవినీతి బీఆర్ఎస్ నాయకులను జైలులో పెట్టాలన్న ఆలోచన బీజేపీకి లేదని యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు.

అన్నింటికి అనుమతులు, నిధులు ఇవ్వాలి : ప్రభుత్వ విప్, అద్దంకి దయాకర్

మోదీ పర్యటనతో తెలంగాణకు న్యాయం జరుగుతుందన్న భావన ఉందని, తెలంగాణ పైన శీతకన్ను చూపించకూడదని శాసన మండలిలో ప్రభుత్వ విప్, అద్దంకి దయాకర్ విజ్ఞప్తి చేశారు. డబల్ ఇంజన్ సర్కార్ అయితేనే సహకరిస్తామన్న భావన వద్దని, మోదీ, బీజేపీ నాయకులు తెలంగాణపైన ప్రేమ పెంచుకోవాలని ఆయన కోరారు. ఆదివారం సీఎల్పీలోని మీడియా సెంటర్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ కూడా గతంలో తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకంగా మాట్లాడారని, ఇటీవల బీజేపీ ఎంపీ తేజశ్వీ సూర్య తెలంగాణను పాకిస్తాన్ తో పోల్చారు..ఎందరో అమరవీరుల త్యాగఫలం తెలంగాణ.. ఆంధ్రా, తెలంగాణ ప్రధాని మోదీ రెండు కళ్లలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. చెన్నై, పూణే నగరాల్లో మెట్రో విస్తరణకు కేంద్రం ఇప్పటికే అనుమతి ఇచ్చిందని, మెట్రో హైదరాబాద్ ఫేజ్ టు విస్తరణకు అనుమతి ఇవ్వాలని అద్దంకి దయాకర్ డిమాండ్ చేశారు. పాలమూరు రంగారెడ్డి కి జాతీయ హోదా ఇస్తే సంతోషిస్తామని, రాజకీయ విభేదాలతో ముడిపెట్టకుండా అనుమతులు, నిధులు ఇస్తారని ఆశిస్తున్నట్లుగా ఆయన తెలిపారు. సమాఖ్య విధానంలో కేంద్రం పెద్దన్న పాత్ర పోషించాలని, తెలంగాణ అభివృద్ధిలో కేంద్రం పాలుపంచుకుంటుందన్న భావన కలగాలని అద్దంకి దయాకర్ అన్నారు.

పెండింగ్ అంశాలపై స్పష్టత ఇవ్వాలి : ఆది శ్రీనివాస్

పెండింగ్‌లో ఉన్న అనేక అంశాలపైన ప్రధాని స్పష్టత ఇస్తారని నమ్ముతున్నామని, మోదీ స్పందించకపోతే బీజేపీ కేంద్ర మంత్రులు,ఎంపీలు, ఎమ్మెల్యేల వైఫల్యంగా చూస్తామని ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ మెట్రో విస్తరణకు అనుమతి కోసం చాలా కాలంగా కేంద్రాన్ని అడుగుతున్నామని, మెట్రో విస్తరణ మోదీ స్పందించాలన్నారు. రీజనల్ రింగ్ రోడ్డుకి అనుమతులు, ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ పోర్టుకు గ్రీన్ ఫీల్డ్ హైవేకి అనుమతి, తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు మహారాష్ట్ర లో బీజేపీ ప్రభుత్వంతో మాట్లాడి అనుమతులు ఇప్పించాలని ఆది శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. పవర్ ప్లాంట్ల నిర్మాణం, విద్యుత్ కోనుగోళ్ల పైన సీబీఐ విచారణ ప్రభుత్వం సిఫార్సు చేసిందని, ఆ విచారణ మొదలయ్యేలా చూడాలన్నారు.

# రేవంత్ - మోదీ సరదా సంభాషణ

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి చేసిన అభ్యర్థనలకు ప్రధాని మోదీ తనదైన శైలిలో, అత్యంత సానుకూలంగా సమాధానమిచ్చారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో కేంద్రం ఎప్పుడూ వెనకడుగు వేయలేదని, ఇప్పటికే రాష్ట్రానికి అన్ని విధాలా సహకరిస్తున్నామని ఆయన ఉదాహరణలతో సహా వివరించారు. రాష్ట్రంలో నిర్మిస్తున్న జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు మరియు రామగుండం ఎరువుల కర్మాగారం వంటి వాటిని ప్రస్తావిస్తూ.. "తెలంగాణ అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది, ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు" అని మోదీ స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ఇరువురు నేతల మధ్య సాగిన సంభాషణ సభకు వచ్చిన వారిని విశేషంగా ఆకట్టుకుంది. రేవంత్ రెడ్డి కోరికపై మోదీ చిరునవ్వుతో స్పందిస్తూ.. కేంద్రం ఇచ్చే ప్రతి పైసా ప్రజల సంక్షేమం కోసమేనని, అభివృద్ధి పనుల్లో రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తే కేంద్రం నుండి పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. రాజకీయ విభేదాలు పక్కన పెట్టి, అభివృద్ధి అజెండాగా సాగిన ఈ చర్చ అటు రాజకీయ వర్గాల్లోనూ, ఇటు సామాన్య ప్రజల్లోనూ కొత్త ఆశలను రేకెత్తించింది.



మొత్తానికి, వేదిక మీద ప్రధాని మరియు ముఖ్యమంత్రి మధ్య కనిపించిన ఈ 'కెమిస్ట్రీ' తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీసింది. విమర్శల కన్నా అభివృద్ధిపైనే ఇద్దరు నేతలు ఫోకస్ పెట్టడం, ఒకరి విన్నపానికి మరొకరు సానుకూల గణాంకాలతో బదులివ్వడం ఈ పర్యటనలోనే హైలైట్‌గా నిలిచింది. ఈ సమన్వయం ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో రాష్ట్రానికి మరిన్ని కేంద్ర నిధులు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# పవన్ కు మోదీ ఆత్మీయ పలకరింపు

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నివాసానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా వెళ్లడం తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనంగా మారింది. ప్రధాని పర్యటనలో భాగంగా ప్రోటోకాల్‌కు అతీతంగా, పవన్ కళ్యాణ్ ఇంటికి వెళ్లి ఆయన్ని పలకరించడం ఉభయ నేతల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాన్ని చాటిచెప్పింది. ప్రధాని రాకతో పవన్ నివాసం వద్ద పండగ వాతావరణం నెలకొనగా, మోదీకి పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, పవన్ కళ్యాణ్ మధ్య దాదాపు అరగంట పాటు ఏకాంతంగా ఆసక్తికరమైన చర్చలు జరిగాయి. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, పాలనలో పవన్ తీసుకుంటున్న చొరవను ప్రధాని ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. పవన్ కళ్యాణ్ నిబద్ధతను, ప్రజల కోసం ఆయన పడుతున్న తపనను మోదీ ఈ సందర్భంగా మెచ్చుకున్నట్లు సమాచారం.



# అందర్నీ కదిలించిన బండి సంజయ్ ప్రసంగం



మొదటి పేజీ తరువాయి

తమపై వస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ.. తాను రాజకీయాల్లో ఎప్పుడూ నీతి నిజాయితీలతోనే పనిచేశానని బండి సంజయ్ స్పష్టం చేశారు. "నేను ఏ తప్పూ చేయలేదు, భవిష్యత్తులో కూడా తప్పు చేయబోను" అని ఆయన పదేపదే నొక్కి చెప్పారు. ధర్మం కోసం, ప్రజల కోసం పోరాడే క్రమంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, తన నిజాయితీని కాలమే నిరూపిస్తుందని ఆయన భావోద్వేగంతో వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా సభకు హాజరైన కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆయనకు మద్దతు తెలిపారు.

ప్రధాని మోదీ సమక్షంలో జరిగిన ఈ సభలో బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. తెలంగాణలో పార్టీని బలోపేతం చేసే క్రమంలో తాను పడిన కష్టాన్ని గుర్తు చేసుకుంటూ, కొందరు కావాలనే బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. అధికారం ఉన్నా లేకపోయినా ప్రజల పక్షాన నిలబడటమే తన నైజమని, కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా తన పంథా మారలేదని ఆయన పేర్కొన్నారు.

# అసోం సీఎంగా మరోసారి హిమంత బిశ్వ శర్మ




ప్రస్తుత మాజీ సీఎం హిమంత బిశ్వశర్మ మరోసారి అసోం సీఎంగా బాధ్యతలు చేపట్టనున్నారు. హిమంతను బీజేపీ ఎల్పీ లీడర్‌గానే కాకుండా, ఎన్‌డీయే కూటమి లెజిస్లేటివ్ పార్టీ లీడర్‌గా ఆదివారం ఎన్నుకున్నారు. ఈ నెల 12, మంగళవారం హిమంత సీఎంగా పదవీ ప్రమాణం చేయనున్నారు. ఆయన ఆధ్వర్యంలో అసోంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది.

హిమంత ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్నారు. ఎన్‌డీయే ఎల్పీ లీడర్‌గా ఎన్నికైన అనంతరం హిమంత మాట్లాడుతూ.. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబీకి కృతజ్ఞతలు తెలిపారు "వరుసగా మూడోసారి అసోంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రధాని మోదీ మమ్మల్ని ఆశీర్వదించారు. ప్రధాని మోదీకి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించారు. రాబోయే ఐదేళ్లు ప్రజల కోసం, అభివృద్ధి కోసం కష్టపడతాం. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీకి కృతజ్ఞతలు" అని హిమంత బిశ్వ శర్మ అన్నారు.

ఇటీవల జరిగిన అసోం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీయే కూటమి భారీ విజయం సాధించింది. 126 సీట్లున్న అసెంబ్లీలో ఎన్‌డీయే కూటమి 102 సీట్లు సాధించింది. అందులో బీజేపీకి 82 సీట్లు దక్కాయి. కూటమిలోని మిగతా రెండు పార్టీల్లో ఏజీపీకి 10 సీట్లు, బీపీఎఫ్ 10 సీట్లు గెలుచుకున్నాయి. ఎన్నికల ఫలితాలు వెలువడ్డ అనంతరం, అంటే బుధవారం నాడే అసోం సీఎంగా హిమంత తన పదవికి రాజీనామా చేశారు.

# ఏపీకి పొంచి ఉన్న ముప్పు విపత్తుల నిర్వహణ సంస్థ బిగ్ అలర్ట్



రాష్ట్రానికి అల్పపీడనం ముప్పు పొంచి ఉంది. బీహార్ నుండి కోస్తాంధ్ర తీరప్రాంతం వరకు ద్రోణి విస్తరించి ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. శ్రీలంక ప్రాంతాల్లో విస్తరించి ఉన్న ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాబోయే 48 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించారు. వీటి ప్రభావంతో గురువారం వరకు కోస్తాంధ్ర,రాయలసీమలో కొన్ని ప్రాంతాల్లో మేఘావృతమైన వాతావరణం, కొన్నిచోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.గంటకు 30-50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు.

రెండు రోజులు వర్షాలు

సోమవారం మన్యం, అల్లూరి, పోలవరం, అనకాపల్లి, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. మంగళవారం మన్యం, అల్లూరి, పోలవరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు.

కొప్పెరపాడులో అత్యధికం

ఆదివారం ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 42 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కాగా 41.6, నగరడోనలో 41.3, ఆళ్లగడ్డలో 41.1, తాడేపల్లిలో 40.9, మాకవరపాలెంలో 40.5, ధర్మాజీగూడెం, కడపలో 40.4,నందనమారెళ్లలో 40.1డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు.

ఆ సమయంలో జాగ్రత్త

వర్షం పడే సమయంలో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా సురక్షిత భవనాల్లో ఆశ్రయం పొందాలన్నారు. పాత భవనాలు, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడరాదని హెచ్చరించారు. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పొలాల్లో ఉన్న రైతులు, పశుకాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. చెట్ల క్రిందకు వెళ్లొద్దని విజ్ఞప్తి చేశారు.

## పరకాలలో పరకాల క్రికెట్ లీగ్ ప్రారంభం



తెలుగు గళం న్యూస్ హనుమకొండ మే10

హన్మకొండ జిల్లా పరకాల మండల కేంద్రంలో స్థానిక యువతను ప్రోత్సహించే ఉద్దేశంతో శివ 11 టీం ఆధ్వర్యంలో పరకాల క్రికెట్ లీగ్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చందుపట్ల రాజిరెడ్డి, పరకాల 15వ వార్డు కౌన్సిలర్ కుక్కల విజయ్, బీజేపీ నాయకులు కానుగుల గోపీనాథ్ హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని తెలిపారు. శరీరం, మనసు ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు కీలకమని అన్నారు. అదేవిధంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో డీహైడ్రేషన్ కారణంగా వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. క్రీడాకారులు ఎక్కువగా నీరు తీసుకోవాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఉదయం లేదా సాయంత్రం సమయంలోనే క్రికెట్ ఆడడం మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో రంజిత్, అశోక్, దిలీప్, శివ, రోహిత్, అజ్మీర సాయి, ఆకుల వెంకటేష్, సిద్ధు, రాజేష్, నవి, టీవీ రాజు, గణేష్, ప్రశాంత్, యాకూబ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లి ప్రేమకు ప్రత్యామ్నాయం లేదు

## మాతృదినోత్సవం సందర్భంగా డా. సీపాన గుణవతి భావోద్వేగం



తెలుగు గళం న్యూస్ శ్రీకాకుళం, మే 10

“మాతృదేవోభవ--పితృదేవోభవ--ఆచార్యదేవోభవ అనే మూడు మహోన్నత సూత్రాలే మానవ జీవితానికి పునాదులు. తల్లి జన్మనిస్తుంది, తండ్రి పెంచి పోషిస్తూ విద్యాబుద్ధులు నేర్పిస్తాడు, గురువు జ్ఞానాన్ని ప్రసాదించి జీవితానికి దిశానిర్దేశం చేస్తాడు. ఈ ముగ్గురిలో తల్లి స్థానం అత్యున్నతమైనది” అని ప్రముఖ సంఘ సేవకురాలు డాక్టర్ సీపాన గుణవతి పేర్కొన్నారు. మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, తల్లి తన పిల్లల కోసం జీవితాంతం ఎన్నో త్యాగాలు చేస్తుందని తెలిపారు. పిల్లలు సుఖంగా ఉండాలని తాను కష్టాలు భరిస్తూ, ఆకలి దప్పికలను కూడా మరిచి వారి భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తుందని చెప్పారు. గర్భంలో తొమ్మిది నెలలు మోసి, జన్మనిచ్చి, ప్రేమతో పెంచి, మంచి మార్గంలో నడిపించే మహోన్నత వ్యక్తి తల్లేనని అన్నారు. తన తల్లి రోహిణి అమ్మను స్మరించుకుంటూ డాక్టర్ గుణవతి భావోద్వేగానికి లోనయ్యారు. గత ఏడాది తన తల్లి మరణం తన జీవితంలో ఎన్నటికీ తీరని లోటును మిగిల్చిందని తెలిపారు. “తల్లి ఉన్నప్పుడు ఆమె ప్రేమ విలువ పూర్తిగా అర్థం కావడం లేదు. కానీ తల్లి దూరమైన తర్వాత ప్రతి క్షణం ఆమె జ్ఞాపకాలే వెంటాడుతుంటాయి. తల్లి ప్రేమకు ఈ ప్రపంచంలో ఎలాంటి ప్రత్యామ్నాయం లేదు” అని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి సమాజంలో యువత తల్లిదండ్రుల సేవలను మరచిపోతుండటం బాధాకరమని ఆమె అన్నారు. తమ జీవితాలను పిల్లల కోసం అంకితం చేసిన తల్లిదండ్రులను గౌరవించి, ప్రేమతో చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి సంతానానిదని పేర్కొన్నారు. కొందరు యువత తల్లిదండ్రులను భారంగా భావించి వృద్ధాశ్రమాలకు పంపించడం అత్యంత దురదృష్టకరమని తెలిపారు. ఇది కుటుంబ వ్యవస్థను బలహీనపరిచే ప్రమాదకర పరిస్థితి అని హెచ్చరించారు. తల్లిదండ్రులు దేవుళ్లతో సమానమని, వారి ఆశీర్వాదం లేకుండా జీవితంలో నిజమైన ఆనందం, అభివృద్ధి సాధ్యం కాదని డాక్టర్ గుణవతి అన్నారు. ప్రతి వ్యక్తి తన తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞతతో ఉండి, వారిని గౌరవించి, సేవ చేయడం ద్వారా వారి రుణం తీర్చుకోవాలని సూచించారు. మాతృదినోత్సవం సందర్భంగా తల్లుల త్యాగాలను స్మరించుకోవడం మాత్రమే కాకుండా, ప్రతిరోజూ వారిని ప్రేమతో గౌరవించాలని ఆమె పిలుపునిచ్చారు.

## మోడీ పర్యటన నేపథ్యంలో సీపీఐ(ఎం) విజ్ఞప్తి--

## తెలంగాణ సమస్యలపై స్పందించాలని డిమాండ్

### బందు సాయిలు జిల్లా కార్యదర్శి, సీపీఐ(ఎం)

తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, మే 10:



ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా తెలంగాణకు ఇచ్చిన విభజన హామీలను అమలు చేయాలని సీపీఐ(ఎం) పార్టీ డిమాండ్ చేసింది. జిల్లాలో అరెస్టు చేసిన పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలని కోరింది. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడి దాదాపు పన్నెండు సంవత్సరాలు గడిచినా కేంద్ర ప్రభుత్వం విభజన హామీల అమలులో నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. అభివృద్ధి, ఉపాధి, సాగునీరు, పరిశ్రమలు, విద్య, సామాజిక న్యాయం వంటి కీలక రంగాల్లో తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభలో రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా రాష్ట్ర సమస్యలపై స్పష్టమైన హామీలు ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రధాన అంశాలు

బయ్యారం స్టీల్ ప్లాంట్ హామీని వెంటనే అమలు చేయాలి. ఆదిలాబాద్ సీసీఐ పునరుద్ధరణ చేయాలి. జహీరాబాద్ ఎన్ఐఎంజెడ్ ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించాలి, ఐటిఐఆర్ ను పునరుద్ధరించాలి

విద్యుత్ సవరణ బిల్లు, లేబర్ కోడ్స్ ద్వారా రైతులు, కార్మికులపై భారాన్ని తగ్గించాలి. కులగణన చేపట్టి బీసీలకు రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలి. ఉపాధి హామీ పథకంలో కేంద్ర వాటా తగ్గింపును రద్దు చేయాలి. సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలి. విద్యా సంస్థలకు పూర్తి నిధులు కేటాయించాలి. పారిశ్రామిక పన్ను రాయితీలు, జీఎస్టీ ప్రోత్సాహకాల్లో తెలంగాణకు న్యాయం చేయాలి. మత విద్వేషాలకు ప్రోత్సాహం ఇవ్వకుండా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సీపీఐ(ఎం) ప్రధానిని కోరింది. లేదంటే రాష్ట్రంలోని లౌకిక శక్తులు ప్రతిఘటనకు సిద్ధమవుతాయని హెచ్చరించింది.

## ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాడాలి

రాజేంద్రనగర్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాట బాటలో ఉండాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింహారావు పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్ మండల పరిధిలోని ఏఆర్ దేవరాజ్ భవన్‌లో, మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన 18 శాఖల కార్యదర్శులు మరియు ప్రజా సంఘాల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నర్సింహారావు మాట్లాడుతూ.. రాష్ట్ర, జిల్లా కమిటీలు ఇచ్చే పిలుపులతో పాటు స్థానిక సమస్యలపై నిరంతరం ప్రజల పక్షాన నిలవాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా శాఖా సమావేశాలు నిర్వహించాలని, అన్ని ప్రజా సంఘాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని వారు స్పష్టం చేశారు. త్వరలోనే మండలంలో AIYF మరియు AISF మహాసభలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా మండలంలోని అర్హులైన నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ శాఖా కార్యదర్శులు జి. సత్యం, జె. సదానంద గౌడ్, సయ్యద్ కాజా, పాండు, సాబేరు, హుస్సేన్ భాయ్, పుష్ప, శాంతమ్మ, సరూప, వాణి, కృష్ణ, కాజా, ప్రతాప్ రెడ్డి, నవీన్ కుమార్, చారి తదితరులు పాల్గొన్నారు.




# కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక విధానాలను తిప్పికొట్టాలి

**-రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో లేబర్ కోడ్ రద్దు కోసం అసెంబ్లీ తీర్మానం చేయాలి**

**-సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు యటాల సోమన్న**



తెలుగు గళం న్యూస్ జనగామ మే10

కేంద్ర బిజెపి మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాల ద్వారా తిప్పి కొట్టాలని తద్వారనే 4 లేబర్ కోడ్ లను వెనక్కు కొట్టగలమని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు శ్రమజీవులు పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న రాజ్యాంగం ప్రకారం వారికి అనుకూలంగా సవరణలు చేశాక రాష్ట్రాలకు ఉందని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను అమలు చేయమని అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపి కార్మిక పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం నిరూపించుకోవాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు యాటాల సోమన్న అన్నారు. ఆదివారం రోజున సిఐటి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్ రూల్స్ ప్రతులను సిఐటియు ఆధ్వర్యంలో నెహ్రూ పార్క్ సెంటర్ వద్ద దగ్ధం చేశారు. ఈ కార్యక్రమానికి సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు యాతాల సోమన్న ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాయడమే కాక రాష్ట్రాల హక్కులను హరిస్తూ చట్టాలను చేసింది. ఒక వైపున ప్రజా సంక్షేమం వల్లిస్తూనే 12 సంవత్సరాల పాలనలో కార్పొరేట్ సంస్థలకు 16 లక్షల కోట్లు రాయితీలు ఇచ్చింది. చివరికి ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ అదాని వంటి బడా పెట్టుబడిదారులకు కట్టబెడుతుంది. అత్యంత ప్రమాదకరమైన కార్మికులను కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లను అమలు చేస్తూ .29 కార్మిక చట్టాలను రద్దు చేయడం హేయమైనా చర్య అన్నారు. నాలుగు కోడ్ ల వలన గతంలో 100 మంది కార్మికులు పనిచేసే పరిశ్రమను మూసివేయాలంటే ప్రభుత్వా అనుమతి తప్పనిసరి. మార్చిన కోడ్ ల వల్ల ఆ సంఖ్యను 300కు పెంచారు. 300కు లోపు కార్మికులు పనిచేసే కంపెనీపై ప్రభుత్వానికి ఎలాంటి బాధ్యత ఉండదు. కార్మికులు సమ్మె చేసే హక్కును యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కును ప్రశ్నార్థకం చేస్తూ పర్మనెంట్ అనే విధానం లేకుండా ఫిక్స్ టర్మ్ ఎంప్లాయ్ అనే విధానం తీసుకువచ్చి పని భద్రత లేకుండా చేస్తుందని విమర్శించారు. అదే విధంగా చికాకో నగరంలో 18 గంటల పనిని పెద్ద ఎత్తున కార్మికులు కర్షకులు పోరాడి ఎనిమిది గంటల పనినీ సాధించుకుంటే ఇప్పుడు మోడీ ప్రభుత్వం 12 నుండి 16 గంటలకు పెంచి కార్పోరేట్ శక్తులకు లాభాలు చేకూర్చే విధంగా చట్టాలు తీసుకొస్తున్నదని విమర్శించారు. వెంటనే తీసుకొచ్చిన కార్మిక కర్షక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే ఈ లేబర్ కోడ్లను అమల్లోకి తీసుకురావడం నిబంధనలను ప్రచురిస్తూ నోటిఫికేషన్ జారీ చేయడం బిజెపి ధమన నీతికి నిదర్శనం అన్నారు. లేనివిడల బిజెపి ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్ కోశాధికారి అన్నబోయిన రాజు సహాయ కార్యదర్శి బూడిద ప్రశాంత్ బండారు శంకర్ కొమురయ్య స్వామి సునీత నరసింహులు రాజు తదితరులు పాల్గొన్నారు.





## మోడీ హైదరాబాద్ పర్యటన: ముందస్తుగా ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి వి.కుమార్ అరెస్ట్

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే 10

వరంగల్ జిల్లా: పర్వతగిరి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో నిరసన కార్యక్రమాలు జరుగుతాయనే సమాచారంతో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా వివిధ వామపక్ష పార్టీల నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఇందులో భాగంగా రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ-ఆర్ఎస్పీ వరంగల్ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్‌ను పర్వతగిరి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పర్వతగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. “లేబర్ కోడ్‌లు కార్మికులకు మరణ శాసనం”-వల్లందాస్ కుమార్

విడుదల అనంతరం వల్లందాస్ కుమార్ మాట్లాడుతూ”కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శాంతియుతంగా కార్యక్రమాలు చేసే హక్కు భారత రాజ్యాంగం కల్పించింది”అని అన్నారు.

“దేశవ్యాప్తంగా కార్మికులపై మోడీ సర్కార్ దాడికి దిగింది. ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ చర్యను ఆర్ఎస్పీ తీవ్రంగా ఖండిస్తోంది” అని పేర్కొన్నారు.

“కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తోంది. నాలుగు లేబర్ కోడ్‌లు దేశ కార్మిక వర్గానికి మరణ శాసనంగా మారుతాయి. పని గంటలు, కనీస వేతనాలు, సామాజిక భద్రత సహా కార్మికుల మౌలిక హక్కులన్నిటినీ లాక్కోవడానికే ఈ కోడ్‌లను రూపొందించారు” అని ఆయన ఆరోపించారు. మోడీ తెలంగాణకు వస్తున్న సందర్భంగా ఈ లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నిరసన తెలపాలని వామపక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని, దోపిడీకి గురవుతున్న అన్ని వర్గాల ప్రజలు ఒక తాటిపైకి రావాలని వల్లందాస్ కుమార్ విజ్ఞప్తి చేశారు.



# పర్వతగిరి మండలం నుండి "పీఎం నరేంద్ర మోదీ" సభకు భారీగా తరలిన కార్యకర్తలు

తెలుగు గళం, పర్వతగిరి / మే 10 :



పర్వతగిరి మండలం నుండి హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు భారతీయ జనతా పార్టీ పర్వతగిరి మండల బీజేపీ నాయకత్వం ఆధ్వర్యంలో భారీ ఎత్తున కార్యకర్తలు తరలివెళ్లారు.వరంగల్

జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు కుడికాల శ్రీధర్ మాట్లాడుతూ బీజేపీ పార్టీ పట్ల ఉన్న నిబద్ధతను,నాయకత్వంపై ఉన్న విశ్వాసాన్ని చాటుతూ మండలం నలుమూలల నుండి కార్యకర్తలు ఉత్సాహంగా సభకు హాజరయ్యారని తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని భారతీయ జనతా పార్టీ పర్వతగిరి మండలం అధ్యక్షుడు హార్యవత్ వినోద్ సమన్వయం చేయగా, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు కుడికాల శ్రీధర్, జిల్లా నాయకులు జాటోత్ శ్రీనివాస్ నాయక్, యువమోర్చా అధ్యక్షులు గొల్లపల్లి సంతోష్ కుమార్ ప్రధాన కార్యదర్శి బత్తిని దేవేందర్ తదితర నాయకులు ప్రత్యేకంగా పర్యవేక్షించారు. కార్యకర్తల రాకపోకల ఏర్పాట్లు, సభకు తరలింపు కార్యక్రమాలు క్రమబద్ధంగా నిర్వహించి పార్టీ శక్తిని చాటిచెప్పారు.

# బీఆర్ఎస్ సీనియర్ నేత పల్లకొండ సమ్మయ్య కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

తెలుగు గళం న్యూస్ ఐనవోలు/మే10



హన్మకొండ జిల్లా: ఐనవోలు మండల కేంద్రంలో ఇటీవల పరమపదించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కీ.శే.పల్లకొండ సమ్మయ్య కుటుంబ సభ్యులను వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పరామర్శించారు. సమ్మయ్య మాజీ సర్పంచ్ పల్లకొండ సురేష్, పల్లకొండ రమేష్ తండ్రి. వారి గృహానికి ఆరూరి రమేష్ వెళ్లి,కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సమ్మయ్య పార్టీకి చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.ఈ పరామర్శ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గడ్డం రఘువంశి గౌడ్, పున్నేల్ సర్పంచ్, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పల్లకొండ సమ్మయ్య మృతి పట్ల గ్రామంలో,పార్టీ శ్రేణుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నేతలు ప్రార్థించారు.

# ఆరూరి రమేష్‌పై విమర్శలు చేసే స్థాయి కడియం కావ్యకు లేదు

## బీఆర్ఎస్ వర్ధన్నపేట నేతల ధ్వజం

తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట/మే 10



వరంగల్ జిల్లా:వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌పై విమర్శలు చేసే స్థాయి వరంగల్ ఎంపీ కడియం కావ్యకు లేదని బీఆర్ఎస్ వర్ధన్నపేట పట్టణ అధ్యక్షుడు గోధుమల మధుసూదన్, మండల పార్టీ అధ్యక్షులు తూల్ల కుమారస్వామి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వర్ధన్నపేటలో విలేకరులతో మాట్లాడుతూ... ఆకేరు వాగు శాశ్వత నిర్మాణ పనుల శిలాఫలక ఆవిష్కరణ కార్యక్రమానికి వచ్చిన ఎంపీ కావ్య బాధ్యతారాహిత్యంగా మాట్లాడారని విమర్శించారు. నమ్మకద్రోహ చరిత్ర కడియం కుటుంబానిదే మాజీ సీఎం కేసీఆర్ కడియం శ్రీహరికి డిప్యూటీ సీఎం పదవి ఇచ్చినా చివరకు పార్టీని మోసం చేసిన చరిత్ర కడియం కుటుంబానిది.గులాబీ కండువా కప్పుకొని పార్టీలోనే ఉండి ఎన్నికల్లో నమ్మకద్రోహం చేశారు అని ఆరోపించారు.ప్రధాన ఆరోపణలు

1వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పాథాలజీ డాక్టర్‌గా పనిచేసిన సమయంలో కడియం కావ్య సమయపాలన పాటించలేదు.

2. ఉదయం ఆలస్యంగా వచ్చి మధ్యాహ్నానికే వెళ్లిపోయే చరిత్ర ఉంది.

3.ఎమ్మెల్సీ స్టిక్కర్‌ను అనర్థంగా వాడుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిని దేశస్థాయిలో నిలిపింది ఆరూరి రమేష్"

మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ హయాంలోనే వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి చెందిందని నేతలు గుర్తు చేశారు."10 మంది డాక్టర్లు ఉన్న ఆసుపత్రిని 45 మంది వైద్యులతో 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసిన ఘనత ఆరూరి రమేష్, బీఆర్ఎస్ ప్రభుత్వానిదే. నెలకు 200కుపైగా ప్రసవాలు జరిగే స్థాయికి తీసుకొచ్చారు. కాంగ్రెస్ హయాంలో ఇప్పుడు ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయో చెప్పాలి" అని సవాల్ విసిరారు.

మట్టిలేని రోడ్లు, సెంట్రల్ లైటింగ్ ఆరూరి ఘనతే వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్, మట్టిలేని రోడ్ల నిర్మాణం ఆరూరి రమేష్ హయాంలోనే జరిగిందని," రమేష్ వేసిన అభివృద్ధి రోడ్లపైనే అప్పట్లో కడియం కావ్య తిరిగారు"అని ఎద్దేవా చేశారు.

**కాంగ్రెస్‌కు ప్రశ్నలు:**

"వర్ధన్నపేటలో ఇప్పటివరకు ఒక మట్టి కూడా పోయని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి చేసిన నాయకుడిపై విమర్శలు చేయడం సిగ్గుచేటు. ఎంపీగా కడియం కావ్య నియోజకవర్గానికి ఏ నిధులు తెచ్చారో చెప్పాలి.చుట్టపు చూపులా వచ్చి విమర్శలు చేయడం సరికాదు. ప్రజలు ఎవరు అభివృద్ధి చేశారో బాగా తెలుసు"అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు గుజ వీరన్న, సిల్వర్ కుమార స్వామి,తిరుపతి సురేష్, సింగర బోయిన రమా రాజశేఖర్,తుమ్మల అరుణ శ్రీధర్, భానోతు జ్యోతి నవీన్, మాజీ ప్రధాన కార్యదర్శి కొండేటి శ్రీనివాస్, పూజ రఘు, తుమ్మల రవీందర్, మార్త సారంగపాణి, సిల్వర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# రాళ్ల జనగాంలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి: ఎనిమిది మంది అరెస్ట్



యాదగిరిగుట్ట: మండల పరిధిలోని రాళ్ల జనగాం గ్రామ శివారులో నిర్వహిస్తున్న జూద స్థావరంపై ఆదివారం యాదగిరిగుట్ట లోకల్ పోలీసులు మరియు యాదాద్రి భువనగిరి జిల్లా స్పెషల్ ఆపరేషన్ టీం సంయుక్తంగా మెరుపు దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రాళ్ల జనగాం శివారులో కొంతమంది వ్యక్తులు ఆర్గనైజ్డ్ పద్ధతిలో మూడుముక్కలాట (జూదం) ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారంతో ఈ దాడులు నిర్వహించారు. ఈ దాడిలో మొత్తం ఎనిమిది మంది వ్యక్తులు పట్టుబడగా, మరో ఇద్దరు పరారయ్యారు. పట్టుబడిన వారిలో భువనగిరి ఆర్బీ నగర్‌కు చెందిన పొగాకు సంపత్, మల్కాపురం నివాసి గుగులోతు వెంకటేష్, దాతరపల్లికి చెందిన బైరాగి జంగాలు, దామరకుంటకు చెందిన వనం సతీష్, పత్తి రమేష్, గజ్వేల్‌కు చెందిన జిల్లా జహంగీర్, యాదగిరిపల్లి నివాసి గుంటిపల్లి కోటేష్ మరియు భువనగిరికి చెందిన మహమ్మద్ ఆజాం ఉన్నారు. కాగా, గాగిల్లాపూర్‌కు చెందిన ఏరువ సల్మాన్ రెడ్డి, గంగసానిపల్లికి చెందిన గంగాదేవి వెంకటేష్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుండి రూ. 43,250 నగదు, 8 మొబైల్ ఫోన్లు, 3 మోటార్ సైకిళ్లతో పాటు పేకాట సెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు యాదగిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

# కల్లెడలో చిరుత యాకయ్యకు బీఆర్ఎస్ నేతల ఘన నివాళి కుటుంబాన్ని పరామర్శించిన ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు



తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే 10

వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలం కల్లెడ గ్రామ వార్డ్ సభ్యులు చిరుత విజయ్ గారి తండ్రి కీ.శే. చిరుత యాకయ్య శనివారం సాయంత్రం పరమపదించారు.ఈ విషాద వార్త తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, మాజీ వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు ఆదివారం కల్లెడ గ్రామానికి చేరుకొని యాకయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన ప్రముఖులు: ఈ కార్యక్రమంలో పర్వతగిరి పి ఏ సి ఎస్ చైర్మన్ యం. మనోజ్ గౌడ పి ఏ సి ఎస్ డైరెక్టర్ జూలపెల్లి గంగాధర్ రావు, మాజీ సర్పంచ్ బొట్ల కిష్టయ్య, మండల నాయకులు బొట్ల మధు, కల్లెడ వార్డు మెంబర్ దొమ్మటి రాజు, నరేష్, చిరుత రాజేష్ తదితరులు పాల్గొని యాకయ్య గారి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. చిరుత యాకయ్య మృతి పట్ల కల్లెడ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు ప్రార్థించారు.

# మోదీ సభకు తరలిన జఫర్ఘడ్ మండల బీజేపీ నాయకులు-- ఘనపూర్‌లో ఘన స్వాగతం




తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్/జఫర్ఘడ్ మే10

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడవసారి ప్రధానిగా ఎన్నికైన తర్వాత తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు భారీ నిధులతో రాష్ట్రంలో అడుగుపెడుతున్న నేపథ్యంలో, ఆయన సభను విజయవంతం చేయడానికి జఫర్ఘడ్ మండలం నుంచి బీజేపీ నాయకులు భారీగా తరలారు. మండల అధ్యక్షులు కోరుకొప్పుల నాగేష్ గౌడ్ ఆధ్వర్యంలో మూడు బస్సుల్లో నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌కు బయలుదేరారు. సభకు వెళ్తున్న ఈ బస్సులను ఘనపూర్‌లో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు



పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐలోని అంజిరెడ్డి జెండా ఊపి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మోదీ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సభ విజయవంతం చేయడానికి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఆనందదాయకమని తెలిపారు.

# ఆలయ పునర్నిర్మాణానికి విరాళం అందజేత



గీసుకొండ మండలంలోని మచ్చాపూర్ గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న పురాతన భక్త ఆంజనేయ సమేత శివాలయ పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన పత్తిపాక లావణ్య -- చంద్రశేఖర్ దంపతులు రూ.20,116 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ చైర్మన్, శాశ్వత పురోహితులు దూపం మఠం రాజుకు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా దూపం మఠం రాజు మాట్లాడుతూ, ఒకే గర్భగుడిలో శివుడు--ఆంజనేయ స్వామి విగ్రహాలు ఉండటం అరుదైన విశేషమని తెలిపారు. కాకతీయుల కాలంలో పడమర ముఖద్వారంతో పాలరాతి శివలింగం, హనుమాన్ విగ్రహాలతో ఈ ఆలయం నిర్మించబడినట్లు వివరించారు. కార్యక్రమంలో పత్తిపాక రవీందర్, వేల్పుల సురేశ్, లక్కర్స్ రవికుమార్, పత్తిపాక రఘు, పెరుమాండ్ల ప్రవీణ్, మర్రి రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో రెచ్చిపోతున్న మట్టి మాఫియా ఆగడాలు

**- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న సంబంధిత శాఖ అధికారులు**

**- చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్**



సత్తుపల్లి,ఆర్ సి,మే10(తెలుగుగళం) న్యూస్: సత్తుపల్లి పట్టణ పరిధిలోని వేశ్యకాంతల చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వందలాది ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తూ కొందరు అక్రమంగా భారీగా సొమ్ము చేసుకుంటున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ అక్రమ తవ్వకాలపై ప్రశ్నించిన వారిపై మట్టి మాఫియా భౌతిక దాడులకు కూడా వెనుకాడటం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతజరుగుతున్నప్పటికీ ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల మౌనానికి కారణమేమిటన్నది ప్రస్తుతం స్థానికంగా బహిరంగ చర్చకు దారితీసింది. చెరువు పరిరక్షణతో పాటు అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, సంబంధిత శాఖ అధికారులు స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# 11నుండి విద్యా వారోత్సవాలను విజయవంతం చేయండి

## మండల విద్యాశాఖ అధికారి యన్.రాజేశ్వరరావు.



సత్తుపల్లి, ఆర్ సి, మే 10 (తెలుగుగళం) న్యూస్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి యన్. రాజేశ్వరరావు తెలిపారు. ఈనెల 11 నుండి 17వ తేదీ వరకు విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయనవెల్లడించారు.వారోత్సవాల్లో భాగంగా ఈనెల 11న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తుంబూరు నందు సమ్మర్ క్యాంపు ప్రారంభించడంతో మొదలుకొని 17 వరకు పాఠశాలల్లో పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు రెమిడీయల్ క్లాసుల ప్రారంభించడం, బడిబాట కార్యక్రమాలు నిర్వహించడం, పుస్తక ప్రదర్శనలు చేయుట, సర్పంచ్ లకు విద్యా కార్యక్రమాలపై వర్క్ షాప్ మొదలగు కార్యక్రమాలు నిర్వహించుట జరుగుతాయని తెలిపారు. అన్ని పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచి అందంగా తీర్చిదిద్దాలని కోరారు. ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రేపటి నుండి 25వ తేదీ వరకు పి.ఎం.ఎస్.హెచ్.ఆర్.ఐ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తుంబూరు నందు మండలంలోని అన్ని పాఠశాలల ఆరో తరగతి నుండి తొమ్మిదవ తరగతి చదివే విద్యార్థులకు ఉదయం ఎనిమిది గంటల నుండి 12 గంటల వరకు వేసవి శిబిరం ఏర్పాటు చేయనైనదని తెలిపారు. శిబిరంలో యోగా, ధ్యానం, డ్రాయింగ్, ఇండోర్ గేమ్స్, కంప్యూటర్ విద్య, స్పోకెన్ ఇంగ్లీష్ లాంటి అంశాలను నేర్పడం జరుగుతుందనితెలిపారు. హాజరయ్యే విద్యార్థులకు స్నాక్స్ అందించుట జరుగుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఈ క్యాంపుకు పంపించి సద్వినియోగం చేసుకొని వారి పిల్లల మానసిక వికాసానికి దోహదపడాలని తెలిపారు.

# ఐనవోలు మండలంలో మక్కల కొనుగోలు కేంద్రాలను సందర్శించిన మాజీ టెస్కాబ్ & డీసీసీబీ చైర్మన్ ప్రస్తుత పాక్స్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు



**తెలుగు గళం, ఐనవోలు / మే 10 :**

హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం నందనం రైతు సేవా సహకార సంఘం పరిధిలోని పంతిని, రాంనగర్, ఒంటిమామిడిపల్లి మరియు అయినవోలు లోని మక్కల కొనుగోలు కేంద్రాలను మాజీ టీజీ క్యాబ్ ఓ డీసీసీబీ చైర్మన్ ప్రస్తుత పాక్స్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా నందనం సొసైటీ చైర్మన్ మార్నెని రవీందర్ రావు మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రాల్లో మక్కలను ప్రభుత్వం నిర్ణయించిన క్వింటాల్‌కు రూ. 2,400 మద్దతు ధరతోనే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, కొనుగోలులో ఆలస్యం జరుగుతోందని వస్తున్న ఫిర్యాదులపై తక్షణమే. పై అధికారుల దృష్టికి తీసుకెళ్తూ రైతులకు ఇబ్బంది కలగకుండా చూస్తున్నామని, మక్కలలో తేమ శాతం ఎంత ఉంది? టార్పాలిన్లు, తూకం మిషన్లు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయో లేదో అధికారులు తనిఖీ చేయలనిసూచించారు.. అకాల వర్షాల నేపథ్యంలో, రైతుల పంటను త్వరగా కొనుగోలు చేసి, కేంద్రాల నుండి వెంటనే తరలించాలని ఏర్పాట్లు చేస్తున్నామని, మక్కలను ఆరబెట్టి, తగిన తేమ శాతం (సాధారణంగా 14% లోపు) ఉండేలా చూసుకుని కేంద్రాలకు తీసుకురావాలి. మధ్యవర్తులను నమ్మకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలనీ రైతులను కోరారు.

# అధికారుల నిర్లక్ష్యంతో కొనుగోలు కేంద్రంలో

## వడదెబ్బకు రైతు మృతి

**స్టేషన్ ఘనపూర్, మే 10 (తెలుగుగళం న్యూస్)**



స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లి గ్రామానికి చెందిన రైతు గాడ్ల రవి కొనుగోలు కేంద్రం వద్ద వడ్ల కల్లం దగ్గర వడదెబ్బ తగిలి అక్కడికక్కడే మృతి చెందిన విషాద సంఘటన చోటుచేసుకుంది.ఈ ఘటనపై మాజీ ఉప ముఖ్యమంత్రి డా. తాటికొండ రాజయ్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.మృతి చెందిన రైతు కుటుంబాన్ని పరామర్శించి తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే మృత రైతు కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా కొనుగోలు కేంద్రాల్లో వెంటనే వడ్లు కొనుగోలు చేయడం, రైతులకు తాగునీరు, నీడ వంటి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో ఘనపూర్ స్టేషన్ మండల కన్వీనర్ తోట సురేందర్, మున్సిపాలిటీ కౌన్సిలర్లు రమ్య, రఘు రెడ్డి, బుర్ల రాజేశ్వర్, పావని, రామ, కవిత తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్



**తెలుగు గళం న్యూస్ ఐనవోలు/మే10**

వరంగల్ జిల్లా:వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని ఐనవోలు మండల కేంద్రంలో మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ పలువురిని పరామర్శించారు.

రోడ్డు ప్రమాద బాధితురాలి కుటుంబం:మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్ – పీఎస్ఓ గడ్డం శ్రీనివాస్ తల్లి కీ.శే. గడ్డం భాగ్యమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారి నివాసానికి వెళ్లిన అరూరి రమేష్ గారు కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.మాజీ సర్పంచ్ పల్లకొండ సురేష్ తండ్రి కీ.శే.సమ్మయ్య ఇటీవల పరమపదించారు. సమ్మయ్య స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను అరూరి రమేష్ పరామర్శించారు.సీనియర్ నాయకులు బరిగాల ఈసాక్ మొలుగురి బాబు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని వారి నివాసాలకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, సర్పంచ్ గడ్డం రఘువంశ గౌడ్ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, అనారోగ్యంతో ఉన్నవారు త్వరగా కోలుకోవాలని అరూరి రమేష్ ప్రార్థించారు.



# బాలానగర్ పోలీస్ స్టేషన్ లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు..!




అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని బాలానగర్ పోలీస్ స్టేషన్లలో మహిళా దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మహిళా సాధికారత, భద్రత, సమాజంలో మహిళల పాత్రను గుర్తిస్తూ బాలానగర్ పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ నర్సింహా రాజు ఆధ్వర్యంలో మహిళా పోలీస్ అధికారులను బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం ఏసీపీ నరేష్ రెడ్డి మాట్లాడుతూ నేరాల నియంత్రణలో మహిళల పోలీసుల కృషిని, తెగింపును, నాయకత్వ లక్షణాలను, సమాజ రక్షణలో వారి నిబద్ధతను సామర్థ్యాన్ని అభినందిస్తూ ప్రశంసలు అందించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నర్సింహా రాజు మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, ప్రతి రంగంలో మహిళలు ముందుకు రావడం ఆనందదాయకమని తెలిపారు. మహిళలు ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఎస్ఐ సరితా రెడ్డి, సిబ్బంది శ్వేత, స్వాతి, నావనీత, అంజలి, మాధవి, అరుణ, శ్రీదేవి, చంద్రకళ, జీఎంఆర్ మహిళా సిబ్బంది ఆనందంగా పాల్గొని అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.

# యాదగిరిగుట్టలో నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్ హరిబాబు

హైదరాబాద్‌కు చెందిన సత్యశ్రీ అనే భక్తురాలు హరిబాబు ఆటోలో కొండపైకి వెళ్తుండగా, ఆమెకు తెలియకుండానే సుమారు మూడు తులాల బంగారు పుస్తెలతాడు ఆటోలో జారిపడిపోయింది. దానిని గమనించిన హరిబాబు, ఏమాత్రం దురాశ పడకుండా వెంటనే ఎస్.పి.ఎఫ్ కంట్రోల్ రూమ్ ను ఆశ్రయించారు. అధికారుల ద్వారా పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ లో అనౌన్స్మెంట్ చేయించి, బాధితురాలిని గుర్తించారు. అనంతరం ఆలయ ఈఓ భవాని శంకర్, ఎస్.పి.ఎఫ్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు సమక్షంలో ఆ బంగారు గొలుసును బాధితురాలికి అందజేశారు. హరిబాబు ప్రదర్శించిన అసాధారణ నిజాయితీని ఆలయ ఈఓ అధికారులు మరియు భక్తులు ప్రత్యేకంగా అభినందించారు.

# జాతీయ స్థాయిలో మెరిసిన భీంపల్లి యువకుడు

## కురిమిండ్ల శ్రీనివాస్‌కు 'బెస్ట్ ఫోక్ సాంగ్ డైరెక్టర్' అవార్డు

**తెలుగు గళం న్యూస్ హనుమకొండ మే10**

తెలంగాణ జానపద కళాకారుల ప్రతిభ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోంది.హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం భీంపల్లి గ్రామానికి చెందిన యువ దర్శకుడు కురిమిండ్ల శ్రీనివాస్, ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ నుండి 'బెస్ట్ ఫోక్ సాంగ్ డైరెక్టర్' అవార్డును అందుకుని విశేష గుర్తింపు సాధించారు.

**ప్రతిభకు అరుదైన గుర్తింపు**

ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో అసోసియేట్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న శ్రీనివాస్, జానపద గీతాలపై ప్రత్యేక మక్కువతో పలు పాటలకు దర్శకత్వం వహిస్తున్నారు.ఆయన రూపొందించిన 'పిలగ ఓ సీనయ్య బంగారు మనసయ్య' అనే జానపద గీతం ప్రేక్షకాదరణ పొందింది. ఈ గీతంలో ఆయన చూపిన సృజనాత్మకతకు మెచ్చి ఐఎఫ్ఎంఎ సంస్థ ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఆయనను ఎంపిక చేసింది.





**ఘనంగా అవార్డు ప్రదానం**

విశాఖపట్నంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన 'విశాఖ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్' సందర్భంగా అవార్డు ప్రదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో ఐఎఫ్ఎంఎ జాతీయ అధ్యక్షుడు దిలీప్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ. సూర్యనారాయణ, విశాఖపట్నం మాజీ మేయర్ దాడి సత్యనారాయణ చేతుల మీదుగా శ్రీనివాస్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

**గ్రామంలో ఆనందం**

సొంత గ్రామానికి చెందిన యువకుడు జాతీయ వేదికపై అవార్డు అందుకోవడం పట్ల భీంపల్లి గ్రామస్తులు, కమలాపూర్ మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.భవిష్యత్తులో శ్రీనివాస్ మరిన్ని జానపద గీతాలకు దర్శకత్వం వహించి జిల్లా, రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నారు.

# కాంగ్రెస్ నేత మందలపు సాయిబాబు చౌదరి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం.



కేపీహెచ్బీ కాలనీ వసంత నగర్ డివిజన్ సర్దార్ పటేల్ నగర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయి బాబు చౌదరి సతీమణి, కీర్తిశేషులు మందలపు రోజా రాణి మూడవ వర్ధంతి సందర్భంగా మందలపు రోజా రాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ వారి సౌజన్యంతో డాక్టర్ సోమశేఖర రావు నేతృత్వంలో మెగా వైద్య శిబిరం నిర్వహించటం జరిగింది. ఈ శిబిరంలో బిపి,2 డి ఏకో, ఫైబ్రో స్కాన్, జి ఆర్ బి ఎస్, ఈసీజీ ,కంటి పరీక్షలు, బరువు, ఎస్ పి ఓ2, పల్స్ రేట్,నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పిసిసి వైస్ ప్రెసిడెంట్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, బండి రమేష్ పాల్గొన్నారు ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరాల ద్వారా ప్రజలు అనునిత్యం తమ ఆరోగ్యాన్ని పరీక్షించుకొని పరిరక్షించుకోవాలని తెలియజేశారు మందలపు సాయి బాబు చౌదరి అనునిత్యం ప్రజా సమస్యలపై పనిచేస్తున్నారని పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఎన్నో సేవా కార్యక్రమాలు, హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నారని కొని ఆడారు అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తర్వాత బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని కొనియాడారు రాబోయే రోజుల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కారానికై అనునిత్యం ప్రజలతో మమేకమై పని చేస్తానని బండి రమేష్ తెలియజేశారు. డాక్టర్ సోమశేఖర్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో లివర్ అనేది ముఖ్యమైనదని దానిలో ఫ్యాటీ లివర్ వల్ల ఎన్నో సమస్యలు వస్తాయని ఆల్కహాల్ వల్లే కాకుండా ప్యాటి లివర్ ద్వారా కూడా పూర్తిస్థాయిలో ఆరోగ్యం నష్టపోతారని ఆరు నెలలకు ఒకసారి ఫ్యాబ్రోస్కాం ద్వారాగా లివర్ నీ పరీక్షించి డాక్టర్ సూచనల మేరకు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. సాయి బాబు చౌదరి ఆధ్వర్యంలో జరిగిన మెడికల్ క్యాంపుకు సుమారు 300 మంది కాలనీవాసులు పాల్గొని పరీక్షలు చేయించుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో కొబ్బిశెట్టి దినేష్, గంధం రాజు, గాలి బాలాజీ, ప్రవీణ్, కిలారి బాబు, చాలా శీను, కొల్లి సత్యనారాయణ, మన్నే సుబ్రహ్మణ్యం, కాజా నవీన్, సిరిపురం మధు, దొప్పలపూడి రత్నాకర్, రేఖ, సత్య, ఉప్పలపాటి రాణి, గోవిందరాజులు పాల్గొన్నారు.

# సీనియర్లకే మరో ఛాన్స్..

## ఇద్దరు పేసర్లతో ప్రపంచకప్ స్క్వాడ్..!





మహిళల టీ20 ప్రపంచకప్ సమీపిస్తున్నందున బంగ్లాదేశ్ బోర్డు స్క్వాడ్‌ను ప్రకటించింది. నిగర్ సుల్తానా కెప్టెన్‌గా పదిహేను మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేసింది. గత ఎడిషన్ స్క్వాడ్‌లోని 11 మందికి మళ్లీ చోటు దక్కగా.. సీనియర్ షర్మీన్ సుల్తానా స్థానంలో టాపార్డర్ బ్యాటర్ తేజ్ నెహర్‌కు సెలెక్టర్లు అవకాశమ ఇచ్చారు. అయితే.. అందర్నీ ఆశ్చర్య పరుస్తూ ఈ ఐసీసీ ఈవెంట్‌లో ఇద్దరు పేసర్లతోనే బంగ్లా జట్టు ఆడనుంది.

అంతర్జాతీయ క్రికెట్‌లో పొట్టి ప్రపంచకప్ పండుగకు బంగ్లాదేశ్ మహిళల జట్టు సిద్ధమవుతోంది. స్క్వాడ్ ఎంపిక అనంతరం చీఫ్ సెలెక్టర్ సజాద్ అహ్మద్ మాట్లాడుతూ ఇద్దరు పేసర్లను మాత్రమే తీసుకోవడంపై వివరణ ఇచ్చాడు. 'బంగ్లాదేశ్ బృందంలో ఇద్దరు పేసర్లు ఉండడానికి కారణం పేసర్లు త్వరగా గాయపడుతారు. పైగా ఇంగ్లండ్‌లో వికెట్ ఒకప్పటిలా పేస్‌కు కాకుండా ఉపఖండం మాదిరిగా ఉంటుందని తెలిసింది. అంటే.. స్పిన్నర్లకు అనుకూలిస్తాయి.

సో.. అందుకే స్పిన్నర్లపై నమ్మకం ఉంచాం. వన్డేల్లో రాణిస్తున్న షర్మీన్ సుల్తానా బదులు తేజ్ నెహర్‌ను ఎంపిక చేయడానికి కారణముంది. నెహర్ వైవిధ్యమైన ప్లేయర్. ఆమె ఓపెనింగ్ నుంచి ఆరో స్థానంలో ఎక్కడైనా ఆడగల సమర్థురాలు. డెత్ ఓవర్లలో తను గొప్పగా ఆడగలదు' అని సజాద్ వెల్లడించాడు. అంతేకాదు ఫార్మాట్‌కు తగ్గట్టుగా దూకుడైన ఆట ఆడేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నాడు.

'బంగ్లాదేశ్ జట్టు డిఫెన్స్ స్టయిల్ బ్యాటింగ్ అతిపెద్ద సమస్యగా మారింది. ఒక్కరాత్రిలోనే అంతా మారిపోతుందని నేను చెప్పను. కానీ, ఈ సమస్యను పరిష్కరించేందుకు సెలెక్టర్లు ప్రయత్నిస్తున్నారు' అని సజాద్ తెలిపాడు. టాపార్డర్‌లో నిగర్ సుల్తానా, షర్మీన్ అక్తర్, శోభనా మొస్త్రే, తేజ్ నెహర్ కీలకం కానున్నారు. నిరుడు భారత్, శ్రీలంక ఆతిథ్యమిచ్చిన వన్డే వరల్డ్‌కప్‌లో మెరిసిన యువ పేసర్ మరుఫా అక్తర్‌తో పాటు ఫరిహా ఇస్లాం కొత్త బంతిని పంచుకోనుంది. వరల్డ్‌కప్ సన్నాహకాల్లో భాగంగా నెదర్లాండ్స్, స్కాట్లాండ్‌తో ముక్కోణపు సిరీస్ ఆడనుంది. ఇంగ్లండ్ వేదికగా జూన్12 నుంచి పొట్టి ప్రపంచకప్ మొదలవ్వనుంది.

బంగ్లాదేశ్ ప్రపంచకప్ స్క్వాడ్ : నిగర్ సుల్తానా జోటీ(కెప్టెన్), నహిదా అక్తర్(వైస్ కెప్టెన్), షర్మీన్ అక్తర్, శోభనా మొస్త్రే, షోర్నా అక్తర్, రీతు మోని, రబేయ ఖాన్, పాహిమా ఖాతూన్, ఫరీహ ఇస్లాం, మరుఫా అక్తర్, షాంజిద అక్తర్, సుల్తానా ఖాతున్, దిలరా అక్తర్, జుయైరియా ఫిర్దౌస్, తాజ్ నెహర్.

# ఉర్విల్ మెరుపులు..

## సీఎస్కే సూపర్ విక్టరీ

ఐపీఎల్ 2026లో భాగంగా జరిగిన ఉత్కంఠ భరిత పోరులో చెన్నై సూపర్ కింగ్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ నిర్దేశించిన 204 పరుగుల భారీ లక్ష్యాన్ని చెన్నై మరో 4 బంతులు మిగిలి ఉండగానే 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. చెన్నై బ్యాటర్ ఉర్విల్ పటేల్ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నైకి ఉర్విల్ పటేల్ కళ్లు చెదిరే ఆరంభాన్ని ఇచ్చాడు. కేవలం 13 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న ఉర్విల్, మొత్తంగా 23 బంతుల్లో 65 పరుగులు చేసి స్టేడియాన్ని హోరెత్తించాడు. అతడికి తోడుగా కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (42), సంజు శాంసన్ (28), కార్తీక్ శర్మ (20) తమ వంతు సహకారం అందించారు. లఖ్‌నవూ బౌలర్లలో దిగ్వేష్ సింగ్, షాబాజ్ అహ్మద్ చెరో రెండు వికెట్లు తీసినప్పటికీ చెన్నై విజయాన్ని అడ్డుకోలేకపోయారు.



టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. ఓపెనర్ జోష్ ఇంగ్లిస్ ఆకాశమే హద్దుగా చెలరేగి కేవలం 33 బంతుల్లోనే 85 పరుగులు సాధించాడు. చివర్లో షాబాజ్ అహ్మద్ (43 నాటౌట్) మెరుపులు మెరిపించడంతో లఖ్‌నవూ స్కోరు 200 దాటింది. చెన్నై బౌలర్లలో జేమీ ఓవర్టన్ 3 వికెట్లతో లఖ్‌నవూ బ్యాటర్లను కట్టడి చేశాడు. అన్షుల్ కంబోజ్ 2 వికెట్లు తీయగా, నూర్ అహ్మద్ ఒక వికెట్ పడగొట్టాడు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న సమయంలోనూ కీలక వికెట్లు తీసి లఖ్‌నవూను మరిన్ని పరుగులు చేయకుండా నిరోధించగలిగారు. పాయింట్ల టేబుల్ లో చెన్నై తన స్థానాన్ని మెరుగు పరుచుకోగా.. లక్నో ఫ్యాన్స్ కు నిరాశలో మునిగిపోయింది.

# ఆ ఆరు నెలలు నరకం చూశా

బాలీవుడ్ స్టార్ నటి కియారా అద్వానీ, తల్లి అయిన తర్వాత తన జీవితంలో చోటు చేసుకున్న భావోద్వేగ మార్పుల గురించి మొదటిసారి మనసు విప్పి మాట్లాడారు. 2025 జూలైలో తన కుమార్తె సారాయకు జన్మనిచ్చిన తర్వాత, తను ఎదుర్కొన్న పోస్ట్‌పార్టమ్ (బిడ్డ పుట్టిన తర్వాత వచ్చే మానసిక స్థితి) దశ గురించి ఒక ఇంటర్వ్యూలో వివరిస్తూ ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. బిడ్డ పుట్టిన తర్వాత తన గుర్తింపు పూర్తిగా మారిపోయిందని కియారా తెలిపారు. "మొదటి ఆరు నెలలు నాపై నాకు జాలి చూపించుకోవడం కూడా చాలా కష్టంగా అనిపించేది నరకం చూశా. ఎప్పుడూ ఇతరుల గురించి ఆలోచించే నేను, మొదటిసారి నా కోసం నేను సమయం కేటాయించుకోవాలని గ్రహించాను. నాలోని భావాలను అర్థం చేసుకోవడానికి, నన్ను నేను ప్రేమించుకోవడానికి ఈ మాతృత్వం ఒక గొప్ప మలుపులా నిలిచింది" అని కియారా ఎమోషనల్ అయ్యారు.

తన కష్టకాలంలో భర్త సిద్ధార్థ్ మల్హోత్రా అందించిన మద్దతును కియారా కొనియాడారు. "ఆ రోజుల్లో నేను చాలా సున్నితంగా ఉండేదాన్ని, చిన్న చిన్న విషయాలకే ఏడ్చేసేదాన్ని. సిద్ధార్థ్ తన సినిమా ప్రమోషన్లలో బిజీగా ఉన్నా, అర్ధరాత్రి వేళ కూడా మా అమ్మ ఇంటికి వచ్చి నన్ను కలిసేవాడు. డాక్టర్ సలహా మేరకు నన్ను ప్రతిరోజూ రాత్రి పూట బయట డ్రైవ్‌కు తీసుకెళ్లేవాడు. ఆ చిన్న ప్రయాణం నాకు స్వచ్ఛమైన గాలిని, మానసిక ప్రశాంతతను ఇచ్చేది" అని ఆమె చెప్పుకొచ్చారు. కాగా.. 2023లో పెళ్లి చేసుకున్న ఈ జంట, గతేడాది పండంటి బిడ్డకు జన్మనిచ్చారు. ప్రస్తుతం కియారా తన తదుపరి చిత్రం 'టాక్సిక్' విడుదలకు సిద్ధమవుతోంది. కన్నడలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో యష్, నయనతార వంటి స్టార్లతో కలిసి ఆమె నటిస్తోంది. మాతృత్వంలోని కష్టసుఖాలను దాటుకుని, మళ్లీ వెండితెరపై మెరవడానికి కియారా సిద్ధంగా ఉన్నారు. ఇందులో రుక్మిణి వసంత్, తారా సుతారియా కూడా కీలక పాత్రలో కనిపించబోతున్నారు.



# ఓటీటీలో టాప్ ట్రెండింగ్‌లో 'డెకాయిట్'




టాలీవుడ్ నటుడు అడవి శేష్ తాజాగా నటించిన 'డెకాయిట్' చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. కొన్ని రోజుల క్రితం విడుదలైన ఈ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద పర్వాలేదనే స్థాయి విజయాన్ని అందుకుంది. తాజాగా ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో మాత్రం ఈ మూవీకి ప్రేక్షకుల నుంచి విశేషమైన స్పందన లభిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం 'డెకాయిట్' ఇండియాలో ప్రైమ్ వీడియోలో నంబర్ 1 ట్రెండింగ్‌లో కొనసాగుతున్నట్లు ఆ సంస్థ అధికారికంగా ప్రకటించింది. దీంతో బాక్స్ ఆఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోకపోయినా, ఓటీటీలో మాత్రం ఈ సినిమాకు మంచి ఆదరణ లభిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించగా, షానీల్ డియో దర్శకత్వం వహించారు. సుప్రియ యార్లగడ్డ, సునీల్ నారంగ్ నిర్మించిన ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు.

# రిలీజ్‌కు సిద్ధమైన 'విశ్వనాథ్ అండ్ సన్స్'



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, టాలీవుడ్ క్లాస్ డైరెక్టర్ వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ఈ సినిమా ఒక స్వచ్ఛమైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని స్పష్టం చేయడంతో, థియేటర్లలో ఈ మూవీ ఎప్పుడు వస్తుందా అని సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా అప్‌డేట్ ప్రకారం.. ఈ చిత్రాన్ని స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. అయితే, వసూళ్ల పరంగా బాక్సాఫీస్ వద్ద పక్కా ప్లానింగ్‌తో ఉన్న చిత్ర యూనిట్, ఒక రోజు ముందుగానే అంటే ఆగస్టు 14న సినిమాను విడుదల చేయాలని యోచిస్తోందట.

ఇలా చేయడం వల్ల స్వాతంత్ర దినోత్సవ సెలవుతో పాటు శని, ఆదివారాలు కూడా కలిసి వస్తాయని ఈ మాస్టర్ ప్లాన్ వేసినట్లు టాక్. ఈ లాంగ్ వీకెండ్ అడ్వాంటేజ్‌తో రికార్డు స్థాయి కలెక్షన్లు రాబట్టవచ్చని నిర్మాత దిల్ రాజు బృందం స్కెచ్ వేసినట్లు సమాచారం. తెలుగు, తమిళ భాషల్లో భారీ ఎత్తున ఈ సినిమా విడుదల కానుంది. కాగా.. ఈ చిత్రంలో సూర్య సరసన 'ప్రేమలు' ఫేమ్ మమిత బైజు కథానాయికగా నటిస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈమూవీని నిర్మిస్తున్నాయి. జీవీ ప్రకాష్ కుమార్ అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. వెంకీ అట్లూరీ మార్క్ ఎమోషన్స్, ఫ్యామిలీ సెంటిమెంట్‌కు సూర్య పవర్‌ఫుల్ యాక్టింగ్ తోడైతే, ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ ప్రేక్షకులు మెచ్చే అంశాలు పుష్కలంగా ఉండటంతో ఆగస్టు నెలలో ఈ 'విశ్వనాథ్ అండ్ సన్స్' సందడి మామూలుగా ఉండదనిపిస్తోంది.

# ఇది నా కెరీర్‌లో మరుపురాని క్షణం

యంగ్ హీరోయిన్ కళ్యాణి ప్రియదర్శన్ తన కెరీర్‌లో మరో అద్భుతమైన మైలురాయిని చేరుకోబోతున్నారు. మే 14న ప్రతిష్ఠాత్మకమైన కాన్స్ ఫిలిం ఫెస్టివల్ వేదికపై ఆమె మొదటిసారి సందడి చేయనున్నారు. ఇటీవల విడుదలైన ఆమె చిత్రం 'లోకా - చాప్టర్ 1 - చంద్ర' ఘన విజయం సాధించిన నేపథ్యంలో, ఈ అంతర్జాతీయ ఆహ్వానం అందడం పట్ల ఆమె ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. "సినిమా ప్రపంచంలో కాన్స్ ఫెస్టివల్‌కు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. అలాంటి వేదికపై అడుగుపెట్టడం నాకు చాలా గర్వంగా అనిపిస్తోంది. ముఖ్యంగా 'లోకా' సినిమాకు ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణ చూస్తుంటే, నా కాన్స్ అరంగేట్రం నాకు మరింత స్పెషల్‌గా అనిపిస్తోంది" అని కళ్యాణి తన ఎగ్జైట్‌మెంట్‌ను పంచుకున్నారు.

ప్రస్తుత కాలంలో భారతీయ సినిమాలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్న తీరుపై కళ్యాణి హర్షం వ్యక్తం చేశారు. "మన కథలు, మన గొంతుకలు ఇప్పుడు గ్లోబల్ స్థాయిలో వినిపిస్తున్నాయి. ఈ గొప్ప మార్పులో నేను కూడా ఒక భాగం కావడం, నా కెరీర్ ఈ దశలో ఉండగా కాన్స్ వంటి వేదికను అనుభవించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను" అని ఆమె పేర్కొన్నారు. ఈ వేడుకను ఎటువంటి ఒత్తిడి లేకుండా, ఎంతో హాయిగా ఆస్వాదించాలని తాను అనుకుంటున్నట్లు ఆమె తెలిపారు. రెడ్ కార్పెట్ మీద కళ్యాణి ఎలా కనిపిస్తారనే దానిపై ఇప్పటికే సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. దీనిపై ఆమె స్పందిస్తూ.. "నా అవుట్‌ఫిట్ గురించి నేను కూడా చాలా ఎగ్జైటెడ్‌గా ఉన్నాను. కొన్ని విషయాలు ఇంకా ప్లాన్ చేస్తున్నాం, కానీ కచ్చితంగా అందరినీ ఆకట్టుకునేలా నా లుక్ ఉంటుంది. ఇది నా కెరీర్‌లోనే మరుపురాని క్షణం" అని చెప్పారు. 'లోకా - చాప్టర్ 1 - చంద్ర' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిన కళ్యాణి, ఇప్పుడు కాన్స్ వేదికపై తన మెరుపులు మెరిపించడానికి సిద్ధమవుతున్నారు.



Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.